క్లుప్తంగా

8న పెంచిన పెన్షన్ల పంపిణీ

అమలాపురం టౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న వైఎస్సార్ పెన్షన్ కానుక కార్యక్రమం ద్వారా పెంచిన, కొత్తగా మంజూరైన పెన్షన్లను ఈ నెల 8వ తేదీ ఉదయం అమలాపురం మున్సిపల్ కార్యాలయంలో లబ్ధిదారులకు అందజేయనున్నట్టు మున్సిపల్ కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడు తెలిపారు. పట్టణంలోని వృద్ధాప్య, వితంతు, ఒంటరి మహిళ, డప్పు కళాకారులు, చేతన, కళాకారులు, మత్స్యకారులకు పెరిగిన పెన్షన్లను ఆ రోజు మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలో చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి అధ్యక్షతన జరిగే కార్యక్రమంలో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్, ఎంపీ చింతా అనురాధ పంపిణీ చేస్తారని చెప్పారు. పట్టణంలోని 15 వార్డు సచివాలయాల కార్యదర్శులు, వలంటీర్లు పెంచిన పెన్షన్ల రికార్డులతో సిద్ధంగా ఉండాలని కమిషనర్ ఆదేశించారు.

కళాకారులు, ప్రతిభావంతులకు సత్కారం



పీటీఎం సంస్థ ద్వారా పలువురిని సత్కరిస్తున్న దృశ్యం

ఐ.పోలవరం: వివిధ రంగాల్లో సేవలందించిన కళాకారులను, ప్రతిభావంతులను సత్కరించడం ఆనందంగా ఉందని పీటీఎం వ్యవస్థాపక అధ్యక్షుడు పుల్లెపు వెంకటేశ్వరరావు అన్నారు. ఐ.పోలవరం జెడ్పీ హైస్కూల్‌లో సంస్థ 16వ వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ అవార్డు గ్రహీతలు వియూరి నాగ సుబ్రహ్మణ్యం, మాకే బాలవర్ధన సత్యనారాయణ, గిన్నిస్ బుక్ అవార్డు గ్రహీత రావి బేబి సత్యవాణి, కళాకారిణి కేవీ వైష్ణవి, టీవీ ఆర్టిస్టు టి.రామన్, యాంకర్ ఎం.కల్యాణి, కవయిత్రులు డి.నాగజ్యోతి, ఎం.కనకలక్ష్మితో పాటు పలువురిని సత్కరించారు. సుమారు 50 మంది కళాకారులకు సత్కారం జరిగింది. నృత్య ప్రదర్శనలు, కవి సమ్మేళనం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఎంపీడీఓ చైతన్య, పాఠశాల హెచ్ఎం వీధి సురేష్‌బాబు, దడాల సురేంద్ర, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

రాయల్ కాపునాడు జిల్లా అధ్యక్షుడిగా కిషోర్



ఉప్పలగుప్తం: డా. బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాయల్ కాపునాడు అధ్యక్షుడిగా గ్రామానికి చెందిన రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ చీకట్ల కిషోర్ నియమితులయ్యారు. ఈ మేరకు రాయల్ కాపునాడు రాష్ట్ర అధ్యక్షుడు గంగనాల వీరాంజనేయులు నుంచి శుక్రవారం ఉత్తర్వులు అందినట్టు కిషోర్ తెలిపారు. ఆయనను మండలానికి చెందిన పలువురు నాయకులు అభినందనలు తెలిపారు.

ఓహెచ్ఆర్ నిర్మాణానికి శంకుస్థాపన



ఓహెచ్ఆర్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ వెంకటేశ్వరరావు

ఉప్పలగుప్తం: నంగవరం గ్రామంలోని జిన్నూరివారిపాలెంలో జల్‌జీవన్ మిషన్‌లో భాగంగా రూ.23 లక్షలతో నిర్మిస్తున్న ఓహెచ్ఆర్‌కు సర్పంచ్, వైఎస్సార్ హార్టీకల్చర్ బోర్డు సభ్యుడు జిన్నూరి వెంకట్వేరరావు శుక్రవారం శంకుస్థాన చేశారు. గ్రామంలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా, ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటుచేసి, పుష్కలంగా తాగునీటిని అందించడానికి చర్యలు చేపడుతున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సలహా మండలి మండల చైర్మన్ మానే శ్రీను, జిన్నూరి దుర్గారావు, నాగప్రసాద్, దొమ్మేటి కిషోర్, ఇంజినీరింగ్ అసిస్టెంట్ శివ పాల్గొన్నారు.

కొత్త ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ



ఆరోగ్యశ్రీ కార్డులను అందిస్తున్న సర్పంచ్ విజయలక్ష్మి

అల్లవరం: ఆరోగ్యశ్రీ పథకం పరిమితిని రూ.25 లక్షలకు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా జారీ చేసిన ఆరోగ్యశ్రీ కార్డులను సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మి ఆధ్వర్యంలో శుక్రవారం బోడసకుర్రు పంచాయతీ పరిధిలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆరోగ్యశ్రీ పథకం, నెట్‌వర్కు ఆస్పత్రులు తదితర విషయాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి దుర్గా శ్రీను, వెల్ఫేర్ అసిస్టెంట్, వలంటీర్లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



కోరంగిలోని పర్యాటక అతిథి గృహాల స్వాగత ద్వారం



గదుల్లో అత్యాధునిక సౌకర్యాలు



కోరింగా మాంగ్రూవ్ వరల్డ్‌లో ఆకట్టుకుంటున్న బయో డైవర్సిటీ సెంటర్

పండగకు ప్రకృతి విడిది

- సంక్రాంతికి ఆహ్వానిస్తున్న కోరంగి
- ఆకర్షణీయంగా అటవీ అతిథి గృహాలు
- స్టార్ హోటళ్లను తలపించే సౌకర్యాలు



పర్యాటకులను ఆకర్షిస్తున్న కోరంగి అటవీ అతిథి గృహాలు

తాళ్లరేవు: సంక్రాంతికి తరలివచ్చే పర్యాటకుల కోసం ప్రకృతి విడిదిలు సిద్ధమయ్యాయి. ప్రకృతి ఒడిలో సేద తీరాలనుకునే పర్యాటకుల కోసం అటవీశాఖ కుటీరాల(అతిథిగృహాలు)ను సిద్ధం చేసింది. అత్యాధునికమైన సౌకర్యాలతో స్టార్ హోటళ్లను తలదన్నేలా వసతులు కల్పించారు.

మండలంలోని కోరంగిలో ఉన్న కోరింగా మాంగ్రూవ్ వరల్డ్ ప్రాంగణంలో నిర్మించిన అటవీ కుటీరాలు పర్యాటకులకు ఆహ్వానం పలుకుతున్నాయి. ఈ కుటీరాల ఏర్పాటుతో ప్రకృతి ఒడిలో విడిది చేసే అవకాశాన్ని అటవీ శాఖ కల్పించింది. దేశంలోనే రెండో అతిపెద్ద మడ అడవులున్న కోరంగి అభయారణ్యాన్ని దర్శించేందుకు వచ్చిన పర్యాటకుల కోసం అటవీ శాఖ తాళ్లరేవు మండలం కోరంగిలో అతిథి గృహాలు (హట్స్) నిర్మించింది. వీటికి అభయారణ్యంలో ఉన్న ప్రముఖ కాలువల పేర్లు నీలార్వా, గాడేరు, ఇంగ్లాయ్ అని పెట్టారు. ఈ హట్స్‌లో ఒక కుటుంబం మాత్రమే ఉండవచ్చు. అలాకాకుండా కుటుంబ సమేతంగా వచ్చి సందర్శించాలనుకునే వారికోసం మాంగ్రూవ్ సూట్, క్యాంప్ ఆఫీస్ అతిథి గృహాలను కూడా సిద్ధం చేశారు. ఫారెస్ట్ రేంజర్ ఎస్ఎస్ఆర్ వరప్రసాద్ నేతృత్వంలో వీటిని మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. పైకి చిన్న గుడిసెల మాదిరిగా కనిపించే ఈ అతిథి గృహాల్లో.. స్టార్ హోటళ్లను తలదన్నేలా అత్యాధునిక సౌకర్యాలను కల్పించారు. అటాచ్‌డ్ బాత్‌రూమ్స్, ఏసీ, టెలివిజన్ సౌకర్యాలతో పాటు, నిరంతరం విద్యుత్ అందుబాటులో ఉండేలా అత్యధిక కెపాసిటీ కలిగిన ఇన్వర్టర్లను ఏర్పాటు చేశారు. నిరంతరం మినరల్ వాటర్ అందుబాటులో ఉండేవిధంగా వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌ను నిర్మించారు. అలాగే బస చేసే పర్యాటకులకు రుచికరమైన అల్పాహారం, భోజనాలను వడ్డించేందుకు క్యాంటీన్‌ను కూడా నిర్మించారు. ఇది అందుబాటులోకి రావాల్సి ఉంది.

రోజుకు రూ.1,500 నుంచి రూ.2 వేలు

అటవీ అతిథి గృహాలు పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. వీటిలో బస చేసేందుకు రోజుకు రూ.1500, సూట్‌కు రూ.2000 వసూలు చేస్తున్నారు. ఈ ప్రాంగణంలో నిర్మించిన కోరింగ బయోడైవర్సిటీ సెంటర్ అభయారణ్యంలోని విశేషాలన్నింటినీ తెలియజేస్తూ ఎంతో ఆసక్తికరంగా ఉంటుంది. పర్యాటక అతిథిగృహాల్లో విడిది చేయాలనుకునేవారు 97057 51309 నంబరులో సంప్రదించి అడ్వాన్స్ బుకింగ్ చేసుకోవచ్చు.

> **పర్యాటకులు సద్వినియోగం చేసుకోండి**
>
> 
>
> కోరంగిలో ఏర్పాటు చేసిన అటవీ అతిథిగృహాలు పర్యాటకులు, సందర్శకులను ఎంతగానో ఆకట్టుకుంటాయి. పచ్చని చెట్లతో ప్రకృతి ఒడిలో సేదతీరుతూ, పల్లెటూరు వాతావరణంలో ఆహ్లాదకరంగా గడపడం చెప్పలేని అనుభూతినిస్తుంది. పర్యాటకులు, సందర్శకులకు అవసరమైన అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశాం. అడ్వాన్స్ బుకింగ్ సౌకర్యం కూడా కల్పించాం. ఆసక్తి ఉన్నవారు సద్వినియోగం చేసుకోండి.
>
> – ఎం.నాగార్జున, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్, కోరింగ అభయారణ్యం

కొత్త పెన్షన్లు 216 మంజూరు

అల్లవరం: మండలంలోని 23 సచివాలయాల పరిధిలో 216 కొత్త పెన్షన్లు మంజూరయ్యాయని ఎంపీడీఓ కృష్ణమోహన్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. కొత్తగా మంజూరైన పెన్షన్లను రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ శనివారం మధ్యాహ్నం అల్లవరం హైస్కూల్ ఆవరణలో పంపిణీ చేస్తారని చెప్పారు. ఈ నెల నుంచి పెన్షన్‌ను రూ.3 వేలు పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. ఇక నుంచి ప్రతి నెలా రూ.3 వేల చొప్పున పెన్షన్ ఇస్తారని ఎంపీడీఓ తెలిపారు. కొత్త వాటితో కలిపి మొత్తం 8,461 పెన్షన్లకు రూ.2.54 కోట్లను లబ్ధిదారులకు వలంటీర్లు పంపిణీ చేయనున్నట్టు చెప్పారు.

'ఆజాద్' నాగ సుధాకొండకు సత్కారం



నాగ సుధాకొండను సత్కరిస్తున్న దృశ్యం

అమలాపురం టౌన్: రక్తదాతను ప్రోత్సహించి, ఎక్కువ మందితో రక్తదానాలు చేయిస్తున్న అమలాపురం ఆజాద్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు యల్లమిల్లి నాగ సుధాకొండను స్థానిక బుద్ధాల బ్లడ్ బ్యాంక్ ప్రతినిధులు శుక్రవారం ఘనంగా సత్కరించారు. బ్లడ్ బ్యాంక్ 8వ వార్షికోత్సవం సందర్భంగా, బ్లడ్ బ్యాంక్‌లో జరిగిన కార్యక్రమంలో నాగ సుధాకొండను సత్కరించి, అభినందించారు. బ్లడ్ బ్యాంక్ అధ్యక్షుడు బుద్ధాల నాని మాట్లాడుతూ రక్తదానాలే కాకుండా, ప్లేట్‌లెట్లనూ దానం చేసేలా నాగ సుధాకొండ ప్రోత్సహిస్తున్నారని అభినందించారు.

సినీ గేయ రచయిత సూర్యకు సత్కారం



సినీ గేయ రచయిత సూర్యను సత్కరిస్తున్న సంఘ ప్రతినిధులు

అమలాపురం టౌన్: జిల్లా చేతివృత్తుల సంఘం ఆధ్వర్యంలో సినీ గేయ రచయిత, అమలాపురం రూరల్ మండలం సమనస గురుకుల పాఠశాల ఉపాధ్యాయుడు దాసరి శ్రీనివాస సూర్యను స్థానిక కూచిమంచి అగ్రహారంలో శుక్రవారం ఘనంగా సత్కరించారు. సంఘ జిల్లా అధ్యక్షుడు దేవాదుల సూర్యనారాయమూర్తి సభకు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథి శ్రీశ్రీకళా వేదిక జిల్లా అధ్యక్షుడు నల్లా నరసింహమూర్తి మాట్లాడుతూ హృదయంలో ఆనందం నిండినప్పుడు, హృదయాన్ని హత్తుకునే పాట పుట్టదు, గుండెకు గాయమైనప్పుడే నిజమైన పాట పుడుతుందని అన్నారు. గత ఏడాదిలో విడుదలైన రెండు చిత్రాల్లో సూర్య రాసిన పాటలకు శ్రోతల ఆదరణ లభించిందన్నారు. అనంతరం సినీ గేయ రచయిత సూర్యను ఘనంగా సత్కరించారు. సంఘ గౌరవాధ్యక్షుడు డీఎస్ కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి గున్నేపల్లి భీమశంకరం, సంయుక్త కార్యదర్శి కరీముల్లా బాబా తదితరులు పాల్గొన్నారు.

రవ్వ ప్లాంటు వద్ద గ్రామస్తుల ధర్నా



ఎస్.యానం రవ్వ ప్లాంటు వద్ద ధర్నా చేస్తున్న గ్రామస్తులు

ఉప్పలగుప్తం: ఎస్.యానం గ్రామంలో ఉన్న కెయిన్ ఎనర్జీ, వేదాంత అనుసంధాన పరిశ్రమ రవ్వ ప్లాంటు వద్ద గ్రామస్తులు శుక్రవారం ధర్నాకు దిగారు. గ్రామానికి చెందిన యువకులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, గ్రామాన్ని అభివృద్ధి చేయాలని, 18 షరతులతో గ్రామస్తులు గతంలో ఆందోళనకు దిగారు. వాటిలో కొన్ని డిమాండ్లు పరిష్కరించామంటూ ప్లాంటు అధికారులు సమాధానమివ్వటంతో.. విషయం రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ సమక్షంలో ఉన్నతాధికారుల దృష్టికి చేరింది. దీనిపై కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆదేశాలతో ఆర్డీఓ జి.కేశవర్ధన్ రెడ్డి గ్రామ స్థాయిలో సమస్య పరిష్కరించే దిశగా ఇటీవల పరిశీలన చేపట్టారు. దీనిపై తాజాగా గ్రామస్తులు ఆందోళనకు దిగారు. తహసీల్దార్ జవ్వాది వెంకటేశ్వరి, అమలాపురం సీఐ వీరబాబు ద్వారా ఆర్డీఓ కేశవర్ధన్‌రెడ్డి ఆందోళనకారులతో చర్చించారు. ఈ నెల 10, 11 తేదీల్లో ఓఎన్జీసీ అధికారులతో చర్చిస్తామని, గ్రామస్తులకు రావాల్సినవి అన్నీ మంజూరుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో గ్రామస్తులు శాంతించి, ఆందోళన విరమించారు. ఎస్సై జి.వెంకటేశ్వరావు భద్రతను పర్యవేక్షించారు.

రేపు మానవత సేవా సమితి వార్షికోత్సవం



వార్షికోత్సవ వివరాలను తెలుపుతున్న సమితి ప్రతినిధులు

అమలాపురం టౌన్: వివిధ సేవా కార్యక్రమాలు చేపడుతున్న మనవత స్వచ్ఛంద సేవా సమితి 49వ వార్షికోత్సవ వేడుకలు ఈ నెల 7న స్థానిక సమితి కార్యాలయం వద్ద నిర్వహిస్తున్నట్టు సమితి అధ్యక్షుడు ముషిణి రామకృష్ణారావు తెలిపారు. అంతర్జాతీయ ప్రముఖులైన ప్రవాస భారతీయులు కూచిభొట్ల ఆనంద్, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నాటక అకాడమీ మాజీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ తదితరులు ముఖ్యఅతిథులుగా హాజరవుతారని చెప్పారు. స్థానిక సమితి కార్యాలయంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో వార్షికోత్సవ వివరాలను రామకృష్ణారావు చెప్పారు. రాయుల కల్చరల్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు డాక్టర్ రాయుడు శ్రీరామచంద్రమూర్తి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కోనసీమ జేఏసీ నాయకుడు కరాటం ప్రవీణ్, నాడీ గ్రంథ పరిశోధకుడు, గాయకుడు ఎంవీఎల్ఎస్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్షతో పేదలకు భరోసా



ఎ.వేమవరప్పాడులో ఎంపీపీ భాగ్యలక్ష్మిని పరీక్షిస్తున్న వైద్యుడు



గోపవరంలో లబ్ధిదారులకు ఆరోగ్యశ్రీ కార్డులను అందజేస్తున్న జెడ్పీటీసీ, సర్పంచ్

అమలాపురం రూరల్: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాల ద్వారా పేదలకు ప్రభుత్వం ఆరోగ్య భరోసా కల్పిస్తోందని ఎంపీపీ భాగ్యలక్ష్మి అన్నారు. శుక్రవారం ఎ.వేమవరప్పాడు సచివాలయం వద్ద రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఏఎంసీ చైర్‌పర్సన్ దంగేటి డొలమణితో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ శిబిరంలో కంటి, ఎముకలు, వివిధ రకాల వ్యాధులకు ప్రత్యేక వైద్యులు సుమారు 200 మందిని పరీక్షించి, మందులు అందించారు. పలువురిని ఆరోగ్యశ్రీ ఆస్పత్రులకు సిఫార్సు చేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీఎంహెచ్ఓ ఎ.భారతిలక్ష్మి, సర్పంచ్ పందిరి విజయ, ఎంపీడీఓ జె.వెంకటేశ్వరరావు, వైద్యులు వాసునాయక్, వర్మ, కార్యదర్శి దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు అండగా..

ఉప్పలగుప్తం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష ప్రజలకు అండగా నిలుస్తోందని జెడ్పీటీసీ గెడ్డం సంపదరావు అన్నారు. సరిపల్లి, గోపవరం ఉమ్మడి సచివాలయ పరిధి గోపవరం గ్రామంలో సర్పంచ్ కుంచే బుల్లియ్య అధ్యక్షతన రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం శుక్రవారం జరిగింది. జెడ్పీటీసీ సంపదరావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ శిబిరంలో 213 మంది రోగులకు పరీక్షించి, ఉచితంగా మందులను అందజేశారు. ఆరోగ్యశ్రీ కార్డులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు కొంకి ఏడుకొండలు, ఎస్ఎస్ కుమార్, కుంచే స్వామి, సత్యనారాయణ, నల్లా వెంకన్న, మాదే సాహెబ్‌కుమార్, వైద్యాధికారులు నాగసుధ, డిల్లీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కొమరగిరిలో జగనన్న ఆరోగ్య సురక్ష

ఐ.పోలవరం: జగనన్న ఆరోగ్య సురక్ష 2.0 వైద్య శిబిరం ఐ.పోలవరం జెడ్పీ స్కూల్‌లో జరిగింది. వైద్యులు 88 మందికి వైద్య సేవలందించారు. వైద్యులు డీఎస్ గాయత్రి, రాజేష్‌బాబు, రాజేష్, పూర్ణ ప్రణీత పరీక్షలు నిర్వహించారు.

యానాం ఓటర్ల జాబితా విడుదల

యానాం: యానాం నియోజకవర్గ ఓటర్ల జాబితాను శుక్రవారం ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్, ఆర్ఏఓ మునిస్వామి రాజకీయ పక్షాల సమక్షంలో విడుదల చేశారు. పుదుచ్చేరిలో 30వ నియోజకవర్గంగా ఉన్న యానాంలో ఈ ఏడాది జనవరి 5 నాటికి మొత్తం ఓటర్లు 39,355 ఉన్నారని, పురుషులు 19,012, మహిళలు 20,343 ఉన్నట్టు వివరించారు. గతేడాది అక్టోబర్ 27 నాటికి 38,732 మంది ఉన్న ఓటర్లలో అదనంగా ప్రస్తుతం 392 కొత్త ఓటర్లు నమోదయ్యారని చెప్పారు. మొత్తం 797 మందిని తొలగించామన్నారు. ఓటర్లజా జాబితాలను వివిధ పార్టీల నేతలకు అందజేశారు.

విద్యకు అధిక ప్రాధాన్యం

64 మందికి ట్యాబ్‌ల అందజేత



పి.మల్లవరం హైస్కూల్‌లో విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేస్తున్న నాయకులు

తాళ్లరేవు: రాష్ట్రంలో ముందెన్నడూ లేనివిధంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యకు అధిక ప్రాధాన్యమిచ్చి, విద్యాభివృద్ధికి కృషి చేశారని ఎంపీపీ రాయుడు సునీత, ఏఎంసీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ తెలిపారు. శుక్రవారం పి.మల్లవరం జెడ్పీ హైస్కూల్‌లో హెచ్ఎం పాలెపు వెంకట శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ట్యాబ్‌ల పంపిణీ కార్యక్రమంలో వారు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. నాడు–నేడు పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్కూళ్లకు ధీటుగా రూపుదిద్దారన్నారు. బైజూస్ ట్యాబ్‌ల ద్వారా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు డిజిటల్ పాఠ్యాంశాలతో పాటు, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిస్తున్నట్టు వివరించారు. అనంతరం 64 మంది విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేశారు. వైస్ ఎంపీపీ ధూళిపూడి నాగేంద్ర ప్రసాద్, ఉప సర్పంచ్ పంపన రామకృష్ణ, ఎంపీటీసీ దున్నా రాంబాబు, నాయకులు రాయుడు గంగాధర్, సబ్బతి రామకృష్ణ, బళ్ల దుర్గాప్రసాద్, మట్టపర్తి తులసి, కావూరి వెంకటేశ్వర్లు, బళ్ల బేబి, స్కూల్ కమిటీ చైర్మన్ వి.పురుషోత్తమ్ పాల్గొన్నారు.

ఇద్దరు అధికార ప్రతినిధులను నియమించాలి

యానాం: పుదుచ్చేరి ప్రభుత్వం యానాం నియోజకవర్గానికి ఇద్దరు అధికార ప్రతినిధులను నియమించాలని శుక్రవారం మాజీ ఎమ్మెల్యే వెలగా రాజేశ్వరరావు ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ఇటీవల ఇద్దరు కేంద్రమంత్రులు పర్యటిస్తే, పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు పాల్గొనలేదని విమర్శించారు. కేంద్రమంత్రుల పర్యటనలో పాల్గొనని మల్లాడిని తొలగించి, ఇద్దరు అధికార ప్రతినిధులను నియమించాలని డిమాండ్ చేశారు.

వలంటీర్ ఔదార్యం



ఆస్పత్రిలో రామారావుకు పెన్షన్ అందజేస్తున్న వలంటీర్ సాయిమణి

అమలాపురం రూరల్: అంబాజీపేట గ్రామానికి చెందిన పనస రామారావు అనారోగ్యంతో అమలాపురం కిమ్స్ ఆస్పత్రిలో ఐసీయూలో చికిత్స పొందుతున్నాడు. మాచవరం-1 సచివాలయానికి చెందిన వలంటీర్ కర్ర సాయిమణి శుక్రవారం ఆస్పత్రికి వచ్చి పెన్షన్‌ను అందజేసి తన ఔదార్యాన్ని చాటుకున్నారు. వలంటీర్ సాయిమణిని రామారావు బంధువులు, అధికారులు అభినందించారు.

సంక్షిప్తంగా..

శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

యానాం: యానాం జిల్లా పరిశ్రమల కేంద్రం(డిక్) ఆధ్వర్యంలో 2023–24 సంవత్సరానికి ఇన్‌ప్లాంట్ ట్రైనింగ్ ఇచ్చేందుకు నిరుద్యోగ యువతీ, యువకుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు శుక్రవారం ఆర్ఏఓ మునిస్వామి ఓ ప్రకటనలో తెలిపారు. ఏడాది శిక్షణ ఉండే కంప్యూటర్ ఆపరేషన్ అండ్ ఆఫీస్ మేనేజ్‌మెంట్, అకౌంటింగ్ అసిస్టెంట్, ఇంజినీరింగ్ అసిస్టెంట్, స్టోర్ అసిస్టెంట్, కెమికల్, ఎనలిటికల్ ల్యాబ్ ఎనాలసిస్ట్, జీజీహెచ్‌లో క్లినికల్ అసిస్టెంట్, డేటా ఎంట్రీ అసిస్టెంట్, ఫ్రంట్ ఆఫీస్ అసిస్టెంట్ తదితర కోర్సులు ఉన్నాయన్నారు. అభ్యర్థులు ఈ నెల 25లోగా దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు.

ఉత్సాహంగా రంగవల్లుల పోటీలు

యానాం: వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన రంగవల్లుల పోటీల్లో యువతులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. స్థానిక ఎస్‌టీపీపీ ప్రభుత్వ కళాశాలలో నిర్వహించిన పోటీల్లో పలువురు వేసిన రంగవల్లులు ఆకట్టుకున్నాయి. ఇండ్లపై మొక్కల పెంపకం, పెరటితోటల పెంపకం పోటీల నేపథ్యంలో అధికారులు ఇళ్లకు వెళ్లి పరిశీలించారు. విజేతలకు ఫల, పుష్ప ప్రదర్శనలో బహుమతులు అందజేయనున్నారు.

జేవీవీ కృషి ప్రశంసనీయం

యానాం: జేవీవీ యానాం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతీయ శాస్త్రీయ దృక్పథం ప్రచార కార్యక్రమం అభినందనీయమని ప్రాంతీయ విద్యాశాఖాధికారి పంపన లక్ష్మణ్‌ప్రవీణ్ అన్నారు. శుక్రవారం జరిగిన కార్యక్రమానికి జేవీవీ అధ్యక్షుడు ఆనాల వీరభద్రరావు అధ్యక్షత వహించారు. జేవీవీ నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

కవులకు సత్కారం



సత్కారం అందుకుంటున్న లక్ష్మణాచార్యులు

యానాం: ఆంధ్ర సారస్వత పరిషత్ అంతర్జాతీయ తెలుగు కవి సమ్మేళనంలో పాల్గొన్న యానాం కవులను ఘనంగా సత్కరించారు. ఆంధ్ర సారస్వత పరిషత్, చైతన్య విద్యాసంస్థల సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం కవులు పెద్దింటి లక్ష్మణాచార్యులు, తాతపూడి సోమశేఖరశర్మను సత్కరించి, ప్రశంసాపత్రాన్ని, జ్ఞాపికను అందజేశారు.

పీడబ్ల్యూడీ ఈఈని నియమించాలి

యానాం: నియోజకవర్గ పరిధిలో నిర్మాణ పనులు నిర్వహించే కీలకమైన పబ్లిక్‌వర్క్స్ డిపార్ట్‌మెంట్ (పీడబ్ల్యూడీ) శాఖలో ఈఈ పోస్టు యానాంలో లేకపోవడంతో ఆర్థికంగా పలు సమస్యలను ఎదుర్కొంటున్నట్టు శుక్రవారం యానాం కాంట్రాక్టర్స్ అసోసియేషన్ ఆర్ఏఓ మునిస్వామికి వినతిపత్రం అందజేశారు. చేసిన పనులకు బిల్లులు కాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నట్టు వారు పేర్కొన్నారు. తక్షణం ఈఈని నియమించాలని కోరారు.

సొంత ఖర్చుతో రోడ్డుకు మరమ్మతులు



మరమ్మతులు చేయిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

అమలాపురం టౌన్: పట్టణంలోని 26వ వార్డులో మెయిన్ రోడ్డు నుంచి రోహిణీ తల్లీ పిల్లల ఆస్పత్రికి వెళ్లే సీసీ రోడ్డు పలుచోట్ల గోతులు పడడంతో, ఆస్పత్రికి వచ్చే గర్భిణులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ఆ వార్డు కౌన్సిలర్ యండమూరి గంగ భర్త, వైఎస్సార్ సీపీ నాయకుడు శ్రీను సొంత ఖర్చులతో వాటికి మరమ్మతులు చేయించారు. వార్డుకు చెందిన పార్టీ నాయకులు చంటి, వెంకటేశ్వరరావు, గోవింద్, ఏసు, సుధాకర్, సతీష్, రాజు, బాబ్జి సహకారంతో ఈ పని చేసినట్టు యండమూరి శ్రీను తెలిపారు. వాహన చోదకులు, ఆస్పత్రికి వచ్చే రోగుల అసౌకర్యాన్ని దూరం చేసేందుకు మరమ్మతులు చేయించామని చెప్పారు.

